ష్.. ఎక్కువ చప్పుడు చేయొద్దు



సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేస్తున్న ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్, పోలీసు అధికారులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 'కొందరు ద్విచక్ర వాహనాలకు ఇష్టారీతిన సైలెన్సర్లు అమర్చుకుంటున్నారు. తయారీదారులు ఇచ్చిన వాటి స్థానంలో అధిక శబ్దాన్నిచ్చేవి ఏర్పాటు చేసుకుంటున్నారు. అలా చేస్తే ఉపేక్షించం' అని ఎస్పీ ఏఆర్.దామోదర్ హెచ్చరించారు. ఒంగోలు రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అధిక శబ్దం చేసే 515 సైలెన్సర్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని అద్దంకి బస్టాండ్ వద్ద రోడ్డు రోలర్‌తో శుక్రవారం ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ.. శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, జరిమానా విధించనున్నట్లు తెలిపారు. వాహనాలకు అటువంటి సైలెన్సర్లను విక్రయించే దుకాణ యజమానులు, అమర్చే మెకానిక్‌ల పైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, సీఐలు అజయ్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

నవంబరు 10 నుంచి 'అగ్నివీర్' నియామక ర్యాలీ



రాయచోటి, న్యూస్‌టుడే: అగ్నివీర్ ఆర్మీ నియామక ర్యాలీని నవంబరు 10వ తేదీ నుంచి చేపట్టనున్నట్లు ఆర్మీ నియామక అధికారి కల్నల్ పునీత్ కుమార్ తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్మెన్ పోస్టులకు సంబంధించి ఈ నియామకాలు ఉంటాయని పేర్కొన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని అడ్మిట్ కార్డులు పొందిన అభ్యర్థులు వైఎస్సార్ జిల్లా కడప డీఎస్ఏ స్టేడియంలో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని, దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు.

మాజీ మెక్కుడు... అనుచరుల బొక్కుడు

- అంటకాగిన అధికారులతో ఆన్‌లైన్‌లో నమోదు
- గ్రామ దేవత భూములూ వదలని వైకాపా నేతలు



పెద్దారవీడు మండలంలోని ఓబులక్కపల్లి, తోకపల్లి మీదుగా అనంతపురం- అమరావతి., సానికవరం, చట్లమిట్ల గ్రామాల మీదుగా కర్నూలు- గుంటూరు జాతీయ రహదారులు ఇటుగా వెళ్తుంటాయి. ధరలు పెరగడంతో ఆయా ప్రాంతాల్లో రహదారుల వెంట ఉన్న భూములపై వైకాపా నాయకుల కళ్లు పడ్డాయి. దీంతో గతంలో అయిదేళ్లు మంత్రిగా పనిచేసిన బడా నేత హనుమాన్ జంక్షన్ కుంట సమీపంలో సుమారు రూ.6 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని తన బినామీ పేరిట ఆన్‌లైన్ చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే అదునుగా మిగిలిన నాయకులూ బరితెగించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారీతిన వ్యవహరించారు. భూబకాసురుల అవతారమెత్తి పేదలు, ప్రభుత్వ, గ్రామ దేవతలకు చెందిన స్థలాల్లో పాగా వేశారు. పేద దళితులు అనుభవంలో ఉన్నప్పటికీ తమ కుటుంబ సభ్యుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. అక్రమాన్ని అడ్డుకోకుండా బెదిరింపులకు గురిచేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నాటి బరితెగింపుపై బాధితులు ఇప్పుడు గళం విప్పుతున్నారు. అక్రమాల పరంపరపై మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో తరచూ ఫిర్యాదులు చేస్తున్నారు. – న్యూస్‌టుడే, పెద్దారవీడు



ఆక్రమించి.. ఆపై లీజుకిచ్చి...: ఓబులక్కపల్లి రెవెన్యూలోని సర్వే నంబర్ 43-2లో 4.56 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమి ఉంది. అమరావతి- అనంతపురం జాతీయ రహదారిని ఆనుకుని ఉండటంతో ఎకరా రూ. కోటికి పైగానే పలుకుతోంది. అయిదేళ్లు మంత్రిగా పనిచేసిన బడా నేత కళ్లు ఈ స్థలంపై పడ్డాయి. సానికవరం గ్రామానికి చెందిన తన బినామీ పేరిట ఆన్‌లైన్ చేయించుకున్నారు. అమాత్యులు అడిగిందే తడవుగా రెవెన్యూ అధికారులు కూడా కట్టబెట్టేశారు. ప్రస్తుతం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆ స్థలాన్ని ఇతరులు లీజుకు తీసుకుని పెద్ద రెస్టారెంట్‌ను నిర్మించి వ్యాపారం సాగిస్తున్నారు.


పోలేరమ్మనే బురిడీ కొట్టించే యత్నం...: చట్లమిట్ల రెవెన్యూలోని సర్వే నంబరు 432లో 15.61 ఎకరాల భూమి గ్రామదేవత పోలేరమ్మ పేరిట ఆన్‌లైన్‌లో నమోదై ఉంది. వీటిని ఓ వైకాపా నాయకుడు కాజేయాలని చూశారు. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ప్రయత్నించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు అధికారులు రిజిస్ట్రేషన్‌ను నిలిపేశారు. సదరు భూమిలో ఇప్పటికీ ఆ నాయకుడే సాగులో ఉండటం గమనార్హం.

దస్త్రాలు లేకున్నా కట్టబెట్టేశారు...: తోకపల్లి రెవెన్యూలో సర్వే నంబర్ 3-1సీ1, 3-1సీ2లో మార్కాపురం నియోజకవర్గానికి చెందిన నాటి ప్రజాప్రతినిధి సోదరుడికి 32 సెంట్ల భూమి ఉంది. ఎటువంటి దస్త్రాలు లేకున్నా., స్థానిక వీఆర్వోల నివేదిక అందించకున్నా.. వేరే వ్యక్తుల పేరిట రెవెన్యూ అధికారులు ఈ భూమిని సదరు నేతకు నేరుగా ఆన్‌లైన్ చేయడం విశేషం. సానికవరం రెవెన్యూలో సర్వే నంబర్ 376లో 2.84 ఎకరాల భూమినీ అదే గ్రామానికి చెందిన ఓ నాయకుడికి ఇలాగే కట్టబెట్టేశారు.

ఖాళీ చేయాలంటూ బెదిరింపులు...

వైకాపా ప్రజాప్రతినిధి కుమారుడు ఒకరు మండలంలో చోటా నేతగా చలామణీ అవుతున్నారు. చట్లమిట్ల రెవెన్యూలోని సర్వే నంబర్ 241లో 2.60 ఎకరాలు, 2.38 ఎకరాలను తన కుటుంబ సభ్యుల పేరిట ఆన్‌లైన్ చేసుకున్నారు. 576 సర్వే నంబరులో 1.90 ఎకరాలు, 598-4లో 3.01 ఎకరాలను కూడా తమ వారి పేరిట రాయించుకున్నారు. ఇప్పుడు సదరు భూములను ఖాళీ చేయాలంటూ వాటిల్లో తరతరాలుగా సాగు చేసుకుంటున్న ఎస్సీలను బెదిరింపులకు గురిచేస్తున్నారు.

అధినేతతో జిల్లా ప్రజాప్రతినిధులు



ఈనాడు, ఒంగోలు: ముఖ్యమంత్రి, తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి జిల్లాకు చెందిన ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ బాధ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ మార్గదర్శనం చేశారు. విశ్వసనీయతను పోగొట్టుకోవద్దని హితబోధ చేశారు. ఇసుక, మద్యం వ్యాపారాల్లో తలదూర్చి పార్టీ పరువు తీయొద్దని హెచ్చరించారు. ప్రజలు ఇచ్చిన సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి ఆశయం కోసం పనిచేద్దామని సూచించినట్లు మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ఆరోపణలు వస్తే ఫైవ్ మెన్ కమిటీ పిలుస్తుందని.. వివరణ ఇచ్చుకోవాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు చెప్పారు.

వసతుల కల్పనకు స్వీకారం చుడదాం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో 'స్వీకారం' కార్యక్రమం కింద కనీస మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయంలో సంబంధిత జిల్లా అధికారులతో ఆమె శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాలను దత్తత తీసుకుని మౌలిక వసతులు కల్పించేందుకు సామాజిక బాధ్యతతో ముందుకొచ్చిన కార్పొరేట్ సంస్థల ప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఏ కార్పొరేట్ సంస్థ ఎక్కడ దత్తత తీసుకుంది, అక్కడ చేపట్టబోయే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పనుల పర్యవేక్షణకు నోడల్ అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు లక్ష్మానాయక్, అంజల, జగన్నాథరావు, సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, పరిశ్రమల జీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

దివ్యమైన వివాహం



పుట్టిన రోజంటే కేకులు, కేకలు.. స్నేహితులతో విందులు. చాలామంది ఇంతవరకే ఆలోచిస్తారు. కొద్ది మంది మాత్రం అందుకు భిన్నంగా ఇతరులకు సేవ చేయడం, సమాజానికి ఉపయోగపడే పనులు చేపట్టడాన్ని ఎంచుకుంటారు. ప్రవాస భారతీయుడు వంకాయలపాటి సాంబశివరావు, కవిత దంపతులు రెండో మార్గాన్ని ఎంచుకున్నారు. తమ కుమార్తె వర్షిత పుట్టిన రోజును పురస్కరించుకుని 'దివ్య'మైన క్రతువు చేపట్టారు. సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్టులో ఆశ్రమం పొందుతున్న పేదలైన నాలుగు దివ్యాంగ జంటలకు అన్నీ తామై వ్యవహరించారు. ఒంగోలులోని కళాక్షేత్రంలో శుక్రవారం వివాహం చేయించారు. కుటుంబ జీవనానికి అవసరమైన సామగ్రి, నెలకు సరిపడా సరకులు అందజేశారు. ఈ కార్యక్రమానికి కొమ్మి రమణయ్య, రాజేశ్వరి దంపతులు పెద్దలుగా వ్యవహరించారు. ట్రస్ట్ నిర్వాహకులు సర్దార్‌బాషా, షహనాజ్ దంపతులు, పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, నూకతోటి శరత్, మండవ సుబ్బారావు, టి.రమాదేవి, కొమ్మి కృష్ణయ్య, పేలప్రోలు రామకృష్ణ పరమహంస తదితరులు హాజరయ్యారు. – న్యూస్‌టుడే, ఒంగోలు నగరం



ఉచితం.. మరింత సులభం

- ఇసుక తవ్వకాలకు 256 ప్రదేశాల గుర్తింపు
- ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై రవాణాకు అనుమతులు

ఈనాడు, ఒంగోలు:

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జులైలో ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించింది. తొలుత స్టాక్ పాయింట్ల నుంచి టన్ను రూ.247 చొప్పున విక్రయించింది. అక్కడ నిల్వలు ఖాళీ కావడం.. జిల్లాలో అధికారికంగా రీచ్‌లు లేకపోవడంతో మళ్లీ కొరత తలెత్తింది. ఇదే అదునుగా అక్రమార్కులు అధిక ధరకు విక్రయాలు సాగించారు. ఈ పరిస్థితులతో ఉచిత ఇసుక విధానంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఒక వైపు కొరత, మరోవైపు అధిక ధరలకు విక్రయాలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. అనంతరం మరింత సులభంగా వినియోగదారులకు లభించేలా మార్గదర్శకాలను సిద్ధం చేసినా అవి అమలుకు నోచక సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో స్థానిక అవసరాలకు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా తీసుకెళ్లేందుకు అనుమతిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై ఇసుక సమస్య కొంతైనా తీరనుంది.

తాజా ఉత్తర్వులతో ఉపశమనం...: జిల్లాలోని నదులు, వాగులు, వంకల్లో ఇసుక నిల్వలున్న 256 ప్రాంతాలను జల వనరులు, గనుల శాఖ అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు స్థానిక అవసరాలకు ఎద్దుల బండ్లతో తీసుకెళ్లేలా మార్గదర్శకాలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఇందుకుగాను ఇసుక కావాల్సిన వారు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. ట్రాక్టర్‌లతో ఇసుక తరలింపును ఇప్పటి వరకు అధికారులు అడ్డుకున్నారు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. చాలామంది ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని ఇతర జిల్లాల నుంచి తెచ్చుకోవడానికి మొగ్గుచూపినప్పటికీ టన్నుకు రూ.6 వేల నుంచి రూ.9 వేల వరకు ఖర్చు చేయాల్సి రావడంతో వెనకడుగు వేశారు. తాజా ఉత్తర్వులతో ట్రాక్టర్లకు కూడా అనుమతి లభించడం వారికి ఎంతో ఉపశమనం కలిగించనుంది.

టన్ను రూ. 260కి మించొద్దు...: రాజశేఖర్, డీడీ, గనుల శాఖ

జిల్లాలో స్థానిక అవసరాల కోసం ఎద్దులబండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఉచితంగా తీసుకెళ్లేలా 256 ప్రదేశాలను గుర్తించాం. ప్రైవేట్ భూముల్లో తవ్వకాలకూ దరఖాస్తులు ఆహ్వానించాం. ఇప్పటి వరకు జరుగుమల్లి, కొత్తపట్నంలో రెండు చోట్ల మాత్రమే తవ్వకాలకు అనుమతించాలంటూ దరఖాస్తులు చేసుకున్నారు. అటువంటి చోట్ల కూడా టన్ను రూ.260కి మించి విక్రయించకూడదు.



వర్షాలతో పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులో నీట మునిగిన ఓ పొగాకు చేను

తూర్పున ఎండ.. పశ్చిమాన వాన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో శుక్రవారం భిన్న వాతావరణం నెలకొంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 13 నుంచి 16 వరకు విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టింది. గురువారం ఉదయం తుపాను తీరం దాటడంతో జిల్లా వాసులతో పాటు, యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఇదిలా ఉంటే శుక్రవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పశ్చిమ ప్రకాశంలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. అదే సమయంలో తూర్పు ప్రకాశంలోని మండలాల్లో ఎండ మండింది. పగటి ఉష్ణోగ్రత 35 నుంచి 32 డిగ్రీల మేర నమోదు కావడంతో జనం కాస్త ఉక్కపోతకు గురయ్యారు.

దెబ్బతింటున్న పంటలు....: కొనకనమిట్లలో శుక్రవారం అత్యధిక వర్షపాతం నమోదైంది. కొనకనమిట్ల(35.6); వెలిగండ్ల(11.4); పొదిలి(10.8); మార్కాపురం(21.2); పెద్దారవీడు(12.4); గిద్దలూరు(19.8); బేస్తవారపేట(24.2); కంభం(12.4) మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. అయిదు రోజులుగా వాతావరణం మేఘావృతమై వర్షం పడటంతో ప్రస్తుతం సాగులో ఉన్న పలు రకాల పంటలు దెబ్బతినడమే కాకుండా తెగుళ్లు సోకే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులు...: వర్షాల కారణంగా జిల్లాలోని పలు గ్రామాల మధ్య ఉన్న నదులు, వాగులు, వంకల్లో వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. మార్కాపురం మండలంలోని భూపతిపల్లె గ్రామానికి సమీపంలోని గుండ్లకమ్మ నది; తర్లుపాడు- మార్కాపురం మధ్యలోని కొండవాగు; పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి సమీపంలోని వాగు; తర్లుపాడు మండలం సీతానాగులవరం వద్ద నల్లవాగు; మార్కాపురం- కంభం రహదారిలో కానాల వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో వాహన రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. బేస్తవారపేట మండలం సోమవారపేటలో కొంపల వెంకటరత్నం అనే ఒంటరి వృద్ధురాలికి చెందిన పెంకుటిల్లు వర్షానికి నాని కూలింది.



బేస్తవారపేట: సోమవారపేటలో వర్షాలకు కూలిన వెంకటరత్నం అనే వృద్ధురాలికి చెందిన పెంకుటిల్లు



తర్లుపాడు మండలం సీతానాగులవరం వద్ద రహదారిపై పొంగిపొర్లుతున్న నల్లవాగు

దాగుడు మూతల దండాకోర్

- కేసు లేకుండా బయటపడే యత్నాలు
- మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు



ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే:

వైకాపా పాలనలో గత రెండేళ్లుగా సాగిన కుంభకోణంపై చర్యలకూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అవకతవకలకు పాల్పడి రూ. కోట్లు నొక్కినా ఎక్సైజ్, దుకాణాల సిబ్బందిపై చర్యలకు ఉపక్రమించడం లేదు. అధికారులు ఆడుతున్న ఈ దాగుడు మూతల ఆటలతో వారి తీరూ పలు అనుమానాలకు తావిస్తోంది. నూతన మద్యం విధానంలో భాగంగా ప్రైవేట్ దుకాణాలు ఈ నెల 16వ ప్రారంభమయ్యాయి. అంతకుముందు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మిగిలిన ఉన్న సరకు, దస్త్రాలలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఒంగోలులో రూ.5 కోట్ల మేర కుంభకోణం చోటుచేసుకున్నట్లు ఈ నెల 15న వెలుగుచూసింది. అయినప్పటికీ కేసు నమోదు చేయలేదు.

రోజుల తరబడి కాలయాపన...: తొలుత మంగమ్మ కళాశాల సమీపంలోని ఎలైట్ మాల్ సిబ్బంది ఈ అక్రమంపై జిల్లా ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ మార్నేని రమణ నిధుల గోల్‌మాల్‌కు పాల్పడినట్లు అందులో పేర్కొన్నారు. అదే సమయంలో మాల్ సిబ్బంది పాత్ర పైనా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ విషయం ఎక్సైజ్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ బాధ్యులపై ఇప్పటికీ చర్యలకు ఉపక్రమించలేదు. శాఖాపరమైన విచారణ అంటూ రోజుల తరబడి కాలయాపన చేస్తున్నారు.

చెబుతున్నదొక్కటీ.. చేస్తున్నదొక్కటీ...: రెండేళ్ల నుంచి సాగుతున్న ఈ తంతులో గతంలో పనిచేసిన అధికారుల నిర్లక్ష్యం స్పష్టమైంది. పోలీసు కేసు నమోదైతే నిందితులతో పాటు అప్పటి అధికారులు పలువురు కూడా ఈ కేసుల్లో చిక్కుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో క్రిమినల్ కేసుల వరకు విషయం వెళ్లకుండా సర్దుబాటు చేసుకునే ప్రయత్నంలో ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఉదంతంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, కేసు నమోదవుతుందంటూ ఎక్సైజ్ ఉన్నతాధికారులు గత నాలుగు రోజులుగా చెబుతున్నారు. వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఈ ఉదంతంపై అధికారికంగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెబుతున్నారు. దీంతో రూ. 5 కోట్ల మద్యం కుంభకోణంపై ఎక్సైజ్ అధికారులు దాగుడు మూతలు ఆడుతున్నట్లు తెలుస్తోంది.

తలుపులు బార్లా తెరిచి దోపిడీ

- గత అయిదేళ్లలో ఇష్టారాజ్యంగా ధరలు
- నిర్వహణలో ప్రజాప్రతినిధులకూ వాటాలు
- కొత్త విధానంతోనైనా మారేనా పరిస్థితులు!



ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే:

ప్రభుత్వ మద్యం దుకాణాల మాటున అయిదేళ్ల వైకాపా పాలనలో బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. తమకు ఇష్టం వచ్చిన ధరకు విక్రయించి ఎడాపెడా దోపిడీకి పాల్పడ్డారు. కొన్నిచోట్ల బందెల దొడ్ల మాదిరిగా నిర్వహించారు. ఇరుకు గదులు, దుర్వాసన వెదజల్లే పరిసరాలు, కుక్కలు, ఎలుకల సంచారం వంటి పరిస్థితుల మధ్యే సిటింగ్ ఏర్పాటుచేసి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకున్నారు. అప్పటి వ్యాపారులకు ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండటంతో అధికారులెవరూ వాటి వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.

తొమ్మిది దాటితే పండగే...: గత ప్రభుత్వ హయాంలో అమలైన మద్యం విధానం బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులకు వరంగా మారింది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉదయం 11 గంటల నుంచి పట్టణ ప్రాంతాల్లో రాత్రి తొమ్మిది గంటల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి పది గంటల వరకే విక్రయాలు సాగేవి. అదే సమయంలో బార్లకు రాత్రి 11 గంటల వరకు అనుమతి ఉండేది. ప్రభుత్వ దుకాణాల్లో సరైన బ్రాండ్లు ఉండేవి కావు. ఉన్న కొద్దిపాటి సరకూ నల్లబజారుకు తరలిపోయేది. ఈ పరిస్థితిని బార్ల నిర్వాహకులు తమకు అనుకూలంగా మలచుకున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసివేసిన తర్వాత ప్రీమియం బ్రాండ్లపై క్వార్టర్‌కు రూ.130 నుంచి రూ.150 వరకు, ఖరీదైన మద్యం సీసాలపై రూ.200 నుంచి రూ.300కు పైగా విక్రయించుకున్నారు. వేళాపాళలు లేకుండా కొన్నిప్రాంతాల్లో ఉదయం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి వరకు నిర్వహించేవారు. ప్రస్తుతం ప్రభుత్వ దుకాణాల స్థానంలో ప్రైవేట్‌వి ఏర్పాటు కానున్నాయి. గతంలో మాదిరి జే బ్రాండ్లు కాకుండా నాణ్యమైన మద్యం గతంకంటే తక్కువ ధరకు విక్రయిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో ఇప్పటికైనా బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వహణపై అధికారులు దృష్టి సారిస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

డిగ్రీలో ప్రవేశాలకు అనుమతి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసి డిగ్రీ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థుల రిజిస్ట్రేషన్‌ను ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అధికారులు ఇప్పటి వరకు నిలిపివేశారు. సాంకేతిక కారణాల నెపంతో ఇతర చోట్ల అమలులో ఉన్న ఈ విధానాన్ని ఇక్కడ అమలు చేయలేదు. అదేమని విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ప్రశ్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలల్లో చదివే విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రెండో సంవత్సరం డిగ్రీలో చేరినప్పటికీ సెమిస్టర్‌కు పరీక్ష ఫీజు కట్టించుకోకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ సమస్యను తెలుపుతూ 'జగన్నాటకంలో సమిధలు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో విశ్వవిద్యాలయ అధికారులు స్పందించారు. డిగ్రీ రెండో సంవత్సరంలో చేరిన విద్యార్థులకు రిజిస్ట్రేషన్ చేసి పరీక్షలకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నారు.



'ఈనాడు'లో అక్టోబర్ 3న ప్రచురితమైన కథనం

సమగ్రశిక్షాలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ఒంగోలు నగరం: సమగ్రశిక్షా జిల్లా కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరల్ అధికారుల పోస్టులను ఇన్‌సర్వీస్ స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయనున్నట్లు డీఈవో డి.సుభద్ర తెలిపారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్, ఐఈ కోఆర్డినేటర్, ఎలిమెంటరీ కోఆర్డినేటర్, జీసీడీవో, ప్లానింగ్ కోఆర్డినేటర్, ఏఎస్‌వో పోస్టులకు పారెన్ సర్వీస్ విధానంపై పనిచేయడానికి ఆసక్తిగల స్కూలు అసిస్టెంట్లు దరఖాస్తు చేయవచ్చన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు. సంబంధిత అధికారుల ప్రమాణపత్రం, సర్వీసు రిజిస్టర్ జిరాక్స్‌లు సమర్పించాలని, ఒకటికన్నా ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసేవారు విడివిడిగా వాటిని ఇవ్వాలన్నారు. మార్గదర్శకాలు, దరఖాస్తు నమూనా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.



గడప..గడపకు కన్నీటి కష్టం

❖ ట్యాంకర్ల కోసం నిత్యం ఎదురుచూపులే
❖ కనిగిరిలో వానాకాలంలోనూ తప్పని వేదన

పేద అయినా.. రాజైనా అక్కడ చుక్క నీటి కోసం పరితపించాల్సిందే ! వానలు ముంచెత్తినా..పట్టణంలో వరద పోటెత్తినా బోర్ల నుంచి నీళ్లే ఉండవు. ట్యాంకర్ కోసం ఉదయం నుంచి రాత్రి వరకూ ఎదురుచూడాల్సిందే. పశ్చిమంలో కీలకమైన కనిగిరిలో స్థానికుల కన్నీటి కష్టాలివి. కాలం మారినా..తమ రాత మారడం లేదని వారు వేదన చెందుతున్నారు.

కనిగిరి, న్యూస్‌టుడే:

కనిగిరి మున్సిపాలిటీలో 20 వార్డులుండగా, సుమారు 55 వేలకు పైగా జనాభా ఉంది. పట్టణంలో ఏడాదిలో అధికభాగం బోర్లు వేసినా నీరు పడని పరిస్థితి. పలు మార్లు ప్రయత్నించి విసుగెత్తిన స్థానికులు మున్సిపల్ ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. అవసరాలు పెరిగిన వారు రూ.600 పెట్టి ప్రైవేటు వ్యక్తుల వద్ద ట్యాంకర్ నీటిని కొనుగోలు చేస్తున్నారు. వాస్తవంగా ప్రతి రోజు ఒక్కో మనిషికి మున్సిపాలిటీ ద్వారా 70 లీటర్లు అందించాల్సి ఉండగా కేవలం 30 లీటర్లు మాత్రమే ఇస్తున్నారు. దీంతో ట్యాంకర్ నీటి కోసం గడప గడపలో పానీపట్టు యుద్ధాలు తప్పడం లేదు.

అక్కడ మరీ దుర్భరం..

మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి బజారు ప్రాంతం అత్యంత ధనవంతులుండేది. ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయ నాయకుల నివాసాలెక్కువ ఉన్నాయి. అక్కడి బజారులోని బోర్లలో చుక్క నీరు లేదు. భారీ భవంతులు నిర్మించుకున్నా నీటి వసతి లేకపోవడంతో ఇళ్ల ముందు డ్రమ్ములు కుప్పలు తెప్పలుగా కన్పిస్తుంటాయి. వీరు మున్సిపల్ ట్యాంకర్ నీరు పట్టుకుంటూనే, ప్రైవేటు వారి నుంచి కూడా కొనుగోలు చేస్తుంటారు. కొత్తవీధిలోనూ నిత్యం ఇదే కష్టాలు.

గుత్తేదారులకు రూ.కోట్ల చెల్లింపులు

2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం పట్టణానికి నీరందించేందుకు రూ.200 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ తాగునీటి పథకాన్ని మంజూరు చేసి పనులు కూడా ప్రారంభించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం దీన్ని రద్దు చేసింది. ఏఐఐబీ పథకమంటూ రూ.103.97 కోట్ల నిధులతో ఇంటింటికీ కుళాయి పథకం ప్రవేశపెట్టింది. నాటి అధికారులు, అప్పటి పాలకుల నిర్లక్ష్యంతో అది కాస్తా ఆగిపోయింది. ప్రతి రోజు 140 ట్యాంకర్ల నీటి సరఫరాకు రూ. 56 వేలు చెల్లిస్తున్నారు. ఇలా ఏటా రూ. కోట్ల ప్రజాధనాన్ని గుత్తేదారులకు ధారపోస్తున్నారు. నేతలు తమ కమీషన్లు, రాజకీయాలు పక్కన పెట్టి పైపులైన్ ద్వారా నీటిని అందించడంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని వారంటున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసెఫ్‌ను వివరణ కోరగా, ఇంటింటికి కుళాయి పథకం పనుల పూర్తికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రస్తుతం ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.



వీధంతా డ్రమ్ములే..ముక్కు కాశిరెడ్డి బజారులో చిత్రం



ఆర్టీసీ డిపో వెనుక ప్రాంతంలో డ్రమ్ము నింపుతున్న వృద్ధుడు

నిధులు మంజూర్వగానే ఏకేయూలో నిర్మాణాలు

ఒంగోలు నగరం: కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఉప కులపతి మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు వివిధ విభాగాల సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యలను వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విశ్వవిద్యాలయ నిర్మాణ కోసం పేర్నమిట్ట వద్ద కేటాయించిన స్థలంలో నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఇక్కడి పాత భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. నిధులు మంజూరైతే త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామన్నారు. యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న పరీక్షల విధి విధానాలను వివరించారు. 15 విభాగాలకు చెందిన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం [illegible]. కార్యక్రమంలో డీన్ సోమశేఖర్, కేవీఎన్ రాజు, పద్మజ, ప్రిన్సిపల్ రామ్‌మోహన్, ఎన్ఎస్ఎస్ అధికారి హర్షవర్ధన్, దేవీ వరప్రసాద్, నిర్మలమణి తదితరులు పాల్గొన్నారు.



ఏకేయూ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వైద్యశాల సందర్శన

మాతా శిశు వైద్యశాలకు వచ్చే రోగులకు మరింత మెరుగైన సేవలందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం ఆసుపత్రిని ఆకస్మికంగా పరిశీలించారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఎక్స్‌రే, వైద్యసేవల కౌంటర్, ఆపరేషన్ థియేటర్, పోస్టు నేటల్ వార్డు, కాన్పుల వార్డు, స్త్రీలవైద్యుల గది, యాంటినేటల్ వార్డు తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం మెరుగు పరచుకోవాలన్నారు. సెక్యూరిటీ సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంధ్య, వైద్యాధికారులు ఉన్నారు.

కారాగారంలో వసతులపై ఎస్పీ ఆరా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలులోని జిల్లా కారాగారాన్ని ఎస్పీ ఏఆర్.దామోదర్ శుక్రవారం సందర్శించారు. పరిసరాలతోపాటు, ఖైదీల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జైలులో కల్పిస్తున్న మౌలిక వసతులతో పాటు సమస్యల గురించి నిందితులను అడిగి తెలుసుకున్నారు. జైలు జీవితాన్ని గుణపాఠంగా తీసుకుని పరివర్తన పొందాలని సూచించారు. జైలు నుంచి విడుదలయ్యాక మంచి భవిష్యత్తు వైపు అడుగులు వేయాలన్నారు. ఎలాంటి భద్రత సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు రామకృష్ణ, ఆజయకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



భద్రతా ఏర్పాట్లను తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

నల్లమల ఘాట్‌లో నిలిచిన ట్రాఫిక్

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: మోట్ల మల్లికార్జునపురం సమీపంలోని నల్లమల అటవీ రహదారిలో లారీ, వ్యాను ఢీకొనడంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. కోల్‌కతా నుంచి బళ్లారి వైపు సరకులతో వెళుతున్న లారీ, కర్నూలు నుంచి శ్రీశైలానికి బ్యాంకు నగదు తీసుకుని వస్తున్న వ్యాన్ శుక్రవారం ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఇరు వాహన డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. వాహనాలు రహదారికి అడ్డుగా నిలిచిపోవడంతో దాదాపు గంటపాటు రాకపోకలు స్తంభించాయి. మొబైల్ పోలీసులు క్రేన్‌తో వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించారు.



నుజ్జునుజ్జయిన వ్యాను ముందు భాగం

రోడ్డు, రైలు మార్గాలకు భూసేకరణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో రవాణా మార్గాల నిర్మాణం నిమిత్తం చేపట్టిన భూ సేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. భూ సేకరణ పురోగతిపై స్థానిక ప్రకాశం భవన్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గంతోపాటు జాతీయ రహదారులకు సంబంధించిన పెండింగ్ భూ సేకరణ పనుల వివరాలపై ఆరా తీశారు. పునరావాసం, పెండింగ్‌లో ఉన్న నష్ట పరిహారం, కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. సమావేశంలో మార్కాపురం, కందుకూరు ఉప కలెక్టర్లు వెంకట త్రివినాగ్, శ్రీపూజ, ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ, చిత్రంలో ఉప కలెక్టర్లు వెంకట త్రివినాగ్, శ్రీపూజ

రూ.13.37 లక్షల అపరాధ రుసుం విధింపు

ఒంగోలు గ్రామీణం: ఒంగోలులోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్తు శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మొత్తం 36 బృందాలు 2,224 కనెక్షన్లను తనిఖీ చేశారు. 290 మందికి అదనపు లోడు, మాల్ ప్రాక్టీస్ సంబంధించి రూ. 13,37,400 అపరాధ రుసుం విధించారు. విజిలెన్స్ ఈఈ హైమావతి, ఈఈ హరిబాబు, డీఈఈలు శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, పాండు రంగారావు, ఏఈ శివప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతూనే మృత్యు కౌగిలికి..

❖ గుండెపోటుతో డీఈ..
కుప్పకూలి చోదకుడి మృతి

కనిగిరి, న్యూస్‌టుడే: అప్పటిదాకా ఉల్లాసంగా మాట్లాడుతున్న వారు ఒక్కసారే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద సంఘటనలు శుక్రవారం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్నాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కనిగిరి డీఈగా పనిచేస్తున్న ఆదిశేషు (60) ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా దర్శికి వెళ్లారు. అక్కడ జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొని తిరిగి కనిగిరికి సొంత కారులో సిబ్బందితో మాట్లాడుతూ వస్తున్నారు. కనిగిరిలోని పొగాకు బోర్డు వద్దకు వచ్చేసరికి గుండెపోటుకు గురయ్యారు. కారులో ఉన్న సిబ్బంది గుర్తించి కనిగిరి వైద్యశాలకు తరలించే లోపే మృతి చెందారు. ఈయన సొంతూరు గుంటూరు నగరం.



డీఈ ఆదిశేషు

గుండ్లాపల్లిలో...

మద్దిపాడు: లారీ చోదకుడు కుప్పకూలి ప్రాణాలు కోల్పోయిన సంఘటన మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్లాపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం గుండ్లాపల్లి లారీ యూనియన్ ఆఫీస్‌కు లోడ్ నిమిత్తం రాజస్థాన్‌కు చెందిన శివలాల్ రాజర్ (27) వచ్చారు. అక్కడే ఉన్న నీటి తొట్టె వద్ద వద్దకు వెళ్లి గుండెపోటుతో ఒక్కసారే కిందపడిపోయారు. స్థానికులు వచ్చి పరిశీలించగా, అప్పటికే మృతి చెందారు. మృతుడి సోదరుడు రాంకాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

తండ్రిపై తనయుడి దాడి

పెద్దారవీడు, న్యూస్‌టుడే: ఆస్తి తగాదాలో తండ్రిపై తనయుడు దాడి చేశాడు. ఈ సంఘటన పెద్దారవీడు మండలంలోని హనుమాన్‌జంక్షన్‌కుంటలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఓబులక్కపల్లికి చెందిన దుగ్గెంపుడి నారాయణరెడ్డికి హనుమాన్‌జంక్షన్‌కుంటలో మిద్దె ఉంది. కుమారుడు సత్యనారాయణరెడ్డి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఈ మిద్దెను వేరే వ్యక్తికి విక్రయించాడు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి శుక్రవారం కుమారుడిని ప్రశ్నించేందుకు వెళ్లారు. ఆగ్రహానికి గురైన కుమారుడు తండ్రిపై పిడిగుద్దులు కురిపించడంతో ఆయనకు కంటి కింది భాగంలో తీవ్ర గాయమైంది. వెంటనే బాధితుడు మార్కాపురం జిల్లా వైద్యశాలలో చేరగా, అక్కడి నుంచి మార్కాపురం రూరల్ పోలీసులు సమాచారం అందింది.



రక్తమోడుతున్న నారాయణరెడ్డి

రైలు ఢీకొని ఒకరి దుర్మరణం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి (30) మృతిచెందిన సంఘటన శుక్రవారం పాతసింగరాయకొండ గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. ఒంగోలు జీఆర్పీ ఎస్సై అరుణకుమారి తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు వైపు వెళ్లే ట్రాక్‌పై చల్లకాల్వ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, పంచనామా నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అతను బలవన్మరణానికి పాల్పడినట్లు భావిస్తున్నామన్నారు.

మార్కాపురం
• మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

ప్రాథమిక దశలోనే అభ్యసన లోపాలు గుర్తించాలి


మార్కాపురంలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, పాఠశాల సిబ్బంది

మార్కాపురం పట్టణం, పొదిలి, బేస్తవారపేట, యర్రగొండపాలెం, కంభం, త్రిపురాంతకం గ్రామీణం: అభ్యసన లోపాలున్న పిల్లల్లో ప్రాథమిక దశలోనే గుర్తించాలని ఐఈడీ కోఆర్డినేటర్ కక్కర రమేష్ పేర్కొన్నారు. ప్రపంచ డిస్లెక్సియా దినోత్సవం సందర్భంగా మార్కాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల అభ్యసన వైకల్యాలపై అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పొదిలిలో నిర్వహించిన డిస్లెక్సియా ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రాథమిక దశలోనే చిన్నారుల్లోని లోపాలను గుర్తించేందుకు నిపుణులైన వైద్యను నియమించినట్లు చెప్పారు. ● బేస్తవారపేటలో ఎంఈవో-2 సి.వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో ఐఈఆర్టీలు, ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ● యర్రగొండపాలెంలో ఎంఈవో ఆంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ● కంభంలో ఎంఈవో మాల్యాద్రి, రాచర్లలో ఎంఈవోలు శివశేషేశ్వరరావు, గిరిధరశర్మ అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ● త్రిపురాంతకంలో ప్రత్యేక అవసరాల పిల్లల అవగాహన సదస్సు ప్రదర్శనలో ఎంఈవోలు మల్లికార్జున నాయక్, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దంటూ ఆందోళన


ఆందోళనకు దిగిన ముదిరాజ్‌కాలనీ వాసులు

తర్లుపాడు, న్యూస్‌టుడే: మద్యం దుకాణాన్ని మా ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసే సహించమంటూ తర్లుపాడులోని ముదిరాజ్ కాలనీవాసులు శుక్రవారం రోడ్డుపై ఆందోళనకు దిగారు. ప్రైవేటు వ్యక్తుల దుకాణాలకు ఇళ్ల మధ్యలో, పాఠశాలలకు దగ్గరగా, ప్రభుత్వ వసతి గృహాల పక్కనే ఏర్పాటు చేస్తుండటంతో స్థానికుల నుంచి నిరసన ఎదురుకావాల్సి వస్తోంది. తర్లుపాడులోని ఎస్సీ వసతి గృహం ఒక పక్క, మరో పక్క ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఉండగా మద్యం దుకాణాన్ని ఏ విధంగా ఏర్పాటు చేస్తారంటూ స్థానికులు ఆందోళనకు దిగారు. మద్యం దుకాణం ముందు ఆందోళనకు దిగిన నిరసనకారులను పోలీసులు చెదరగొట్టేందుకు ప్రయత్నం చేశారు. అయితే గ్రామస్థులు ఆందోళనకు దిగగా.. వారికి మద్దతు తెలపాల్సిన స్థానిక ఎమ్మెల్యే తమ్ముడు కందుల రామిరెడ్డి వైన్ షాపు నిర్వాహకుడికి అండగా కూర్చున్నారు. ఇక్కడే దుకాణం నిర్వహిస్తాం ఎవరొస్తారో రాండంటూ సుమారు రెండు గంటల పాటు దుకాణదారుడికి మద్దతుగా నిలవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు.

సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్

మార్కాపురం, గిద్దలూరు పట్టణం: ప్రభుత్వం తక్షణమే పెంచిన విద్యుత్తు ట్రూఅప్.. సర్దుబాటు ఛార్జీలతో పాటు విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు గుమ్మా బాలనాగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మార్కాపురంలోని విద్యుత్తు ఈఈ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ● సీపీఎం పార్టీ పిలుపు మేరకు గిద్దలూరు విద్యుత్తు సబ్ డివిజన్ కార్యాలయం వద్ద జిల్లా కమిటీ సభ్యుడు ఆవులయ్య ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈఈ శేషగిరిరావుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు డాక్టర్. బి.పూర్ణ, డి.శ్రీనివాసులు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.


మార్కాపురం విద్యుత్తు ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

అధ్యాపకుల క్రమబద్ధీకరణ కోరుతూ నిరసన


యర్రగొండపాలెంలో రిబ్బన్లను ధరించి నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

యర్రగొండపాలెం పట్టణం, పొదిలి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించే జీవోను పునఃప్రారంభించాలని కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ ఎల్.పద్మారావు కోరారు. శుక్రవారం పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విరామ సమయంలో కాంట్రాక్టు అధ్యాపకులు సమావేశమై తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యర్రగొండపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో అధ్యాపకులు పసుపు రిబ్బన్లను ధరించి నిరసన తెలిపారు.

పుస్తకావిష్కరణ

యర్రగొండపాలెం పట్టణం: ప్రముఖ కవి దేవులపల్లి విశ్వనాధం రచించిన భాగవతోపాన్యాసాలు అనే పుస్తకాన్ని బాల సాహితీవేత్త శాఖమూరి శ్రీనివాస్ ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక శివాలయం ప్రాంగణంలో దేవులపల్లితో కలిసి ఆయన పుస్తకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు కౌతా వీరాంజనేయశర్మ, రెంటచింతల శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దేవులపల్లి, శాఖమూరి తదితరులు

పశ్చిమంలో కుండపోత వర్షం

- ఉద్ధృతంగా ప్రవహించిన కానాల వాగు
- పొంగిన గుండ్లకమ్మ నది


మార్కాపురం : కొట్టాలపల్లి సమీపంలోని కంభం రహదారిలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న కానాల వాగు

మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, బేస్తవారపేట : మార్కాపురంలో కుండపోత వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలతో పాటు గుండ్లకమ్మనది పొంగి పొర్లింది. గత ఏడాది తర్వాత మార్కాపురంలో 5 సెంటి మీటర్ల వర్షపాతం నమోదు కావడం ఇదే తొలిసారి. కానాల వాగు నుంచి వరద నీరు వేములకోట గ్రామ ఆయకట్టు చెరువులోకి చేరుకోవడంతో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. భూపతిపల్లె, మాల్యవంతునిపాడు గ్రామాల వద్ద ఉన్న గుండ్లకమ్మనదికి భారీ స్థాయిలో వరద నీరు రావడంతో కల్వర్టుల పై నుంచి నీరు ప్రవహిస్తోంది. అమ్మవారిపల్లె వద్ద ఉన్న నల్లవాగు రహదారిపై స్వల్పంగా ప్రవహిస్తుంది. ఈ నీరు అంతా గుండ్లకమ్మనది లోకి వెళ్లే అవకాశం ఉంది. ● తర్లుపాడు మండలంలో తర్లుపాడు, తుమ్మలచెరువు, సీతానాగులరం ప్రాంతాల్లో ఏకదాటిగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో తర్లుపాడులోని కొండవాగు పొంగిపొర్లింది. మండలంలోని సీతానాగులవరం వద్ద మార్కాపురం వెళ్ల రహదారిపై భారీగా వరద నీరు రావడంతో వాహనాలు నిలిచిపోయాయి. మండలంలోని తుమ్మలచెరువు పొలాలోల కురిసిన వర్షానికి 20 ఏళ్ల కిందట పొంగిన దర్గా గుడి పక్కన వాగు ఒక్కసారిగా పొంగిపొర్లింది. ● పెద్దారవీడు మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, వాగుల్లో నీరు చేరి, పొంగి పొర్లడంతో రహదారులన్నీ జలమయం అయ్యాయి. వాగులు రహదారులపై ప్రవహించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పుచ్చకాయలపల్లి నుంచి సుంకేసులకు వెళ్లే రహదారి పూర్తిగా నీటిలో మునిగిపోయింది. ● బేస్తవారపేట పంచాయతీ పాపాయిపల్లి సమీపంలోని ఒంగోలు-గిద్దలూరు జాతీయ రహదారిపై ఉన్న ఆందోళనకు దిగిన తర్లుపాడు ముదిరాజ్‌కాలనీ వాసులు పీతిరి వాగును తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎస్సై రవీంద్రారెడ్డి పరిశీలించారు.


పెద్దారవీడు : పుచ్చకాయలపల్లి వద్ద రహదారిపై పొంగిన వాగు


మార్కాపురం : భూపతిపల్లె వద్ద కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న గుండ్లకమ్మనది ప్రవాహం


తర్లుపాడు : తుమ్మలచెరువు దర్గా వద్ద వాగు ఉద్ధృతి


మార్కాపురం : వేములకోట గ్రామ చెరువులోకి వెళ్తున్న వరద నీరు


తర్లుపాడు : రహదారిపై ప్రవహిస్తున్న కొండవాగు

దెబ్బతిన్న పంటలు

మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు: మార్కాపురం మండలంలో అన్ని రకాల పంటలు 25 వేల ఎకరాల్లో సాగు చేశారు. దీనిలో పత్తి ఒక్కటే 6,050 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ వర్షం కారణంగా పత్తి పంట పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పత్తి పంట తర్వాత కంది, మినుము, మిరప పంట దెబ్బతినే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. పొలాలు అన్నీ నీట మునిగాయి. ఆరు రోజులుగా పడుతున్న వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. వర్షం తగ్గిన తర్వాత పంటలకు ఎంత నష్టం వాటిల్లిందో స్పష్టత వస్తుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ● పెద్దారవీడు మండలంలోగొబ్బూరు, దేవరాజుగట్టు, శివాపురం, పుచ్చకాయలపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లోని పంట పొలాలన్నీ నీటమునిగాయి. ● తర్లుపాడు మండలంలో పంట పొలాలు వరద నీటితో మునిగిపోయాయి.


కోమటికుంటలో మునిగిపోయిన పొగాకు పంట


నికరంపల్లి సమీపంలో నీట మునిగిన పత్తి పంట

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

కంభం, న్యూస్‌టుడే:

పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. స్థానిక రెవెన్యూ కార్యాలయం పూర్తిగా దెబ్బతిని ఉన్నాయి. పలు గదుల్లో స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. కంప్యూటర్ గది పూర్తిగా దెబ్బతినడంతో దాన్ని మూసివేశారు. ఆర్‌ఐ రూంలోనూ పెచ్చులూడి పడుతున్నాయి. దస్త్రాలు ఉండే గదిలోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. వీఆర్వోలు కూర్చునే హాలు చిన్నపాటి వర్షం కురిసినా కారుతోంది. గోడలన్నీ చెమ్మతో ఉన్నాయి. భవనం పూర్తిగా దెబ్బతిని ఉండడంతో భయంగా విధులు నిర్వహించాల్సి వస్తోందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కార్యాలయం ముందు భాగంలో మడుగు కట్టి ఉంటోంది. దాంతో కార్యాలయానికి వచ్చే అధికారులు, ప్రజలు, సిబ్బంది రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు.


విద్యుత్తు శాఖ కార్యాలయం దుస్థితి ఇదీ..


శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయ భవనం

ఉరుస్తున్న మండల పరిషత్తు భవనం

మండల పరిషత్తు కార్యాలయం దెబ్బతింటోంది. కార్యాలయం వరండా, మరుగుదొడ్లు వర్షానికి కారుతున్నాయి. దీంతో కార్యాలయానికి వచ్చే వారు అసౌకర్యానికి గురవుతున్నారు. కొత్తగా మరుగుదొడ్లు నిర్మించినా వాటిని ఉపయోగంలోకి తీసుకురాలేదు. ఈవోపీఆర్డీ గదిలోని కిటికీలు చెదలు తిని పాడైపోతున్నాయి. కిటికీల తలుపులు సరిగా లేవు. ఉపాధి హామీ పథకం గది ఇరుకుగా ఉంది. దీంట్లోనే దస్త్రాలు పెట్టారు. అక్కడే సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఉద్యాన శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షం కురిసినా కారుతూ భవనం లోపల మడుగు కడుతోంది. గోడలు దెబ్బతింటున్నాయి. ఆ శాఖ అధికారిణి కూర్చునే చోటే కారుతోంది. ఇటీవల కురిసిన వర్షానికి మత్స్యశాఖ కార్యాలయంలోని పలు దస్త్రాలు తడిచి పోయాయి. ఆ ప్రాంతంలోనే ఉన్న పంచాయతీ రాజ్ (పీఐయూ) ఇంజినీరింగ్ కార్యాలయ భవనం దెబ్బతింటోంది. సరైన నిర్వాహణ లేకపోవడంతో కారుతోంది. పై అంతస్తుకు వెళ్లే మెట్లపై పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. కార్యాలయ ఆవరణలోనూ పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. నీటి పారుదల శాఖ కార్యాలయ ఆవరణ అంతా పిచ్చిమొక్కలు పెరిగిపోయి అపరిశుభ్రంగా ఉంది. విద్యుత్తుశాఖ ఏడీ కార్యాలయ ఆవరణలోని పలు భవనాలు దెబ్బతిన్నాయి. అవి సరైన రక్షణ ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న భవనాలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు. కారుతున్న భవనం, మరుగుదొడ్లు తదితర వాటిని బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు.

త్రిపురాంతకంలో ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం గ్రామీణం.పొదిలి: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస రెడ్డి తనయుడు రాఘవరెడ్డి శుక్రవారం త్రిపురాంతకం ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ● పౌర్ణమి సందర్భంగా పొదిలి కొండపై ఉన్న శ్రీరాజ్యలక్ష్మి సమేత నరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి భజన సంకీర్తన, పల్లకి సేవ నిర్వహించారు.

పొలంలోకి గొర్రెలు వెళ్లాయని గొడవ

కంభం, న్యూస్‌టుడే : పొలంలోకి గొర్రెలు వెళ్లాయంటూ గొడవ జరిగిన సంఘటన రాచర్ల మండలం ఆకవీడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై కోటేశ్వరరావు కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఖాదర్‌బాష గొర్రెలు అదే ఊరికి చెందిన ఆవులరాజు పొలంలోకి గొర్రెలు వెళ్లాయని ఇద్దరు ఘర్షణ పడ్డారు. దాంతో ఖాదర్‌బాషకు గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని గిద్దలూరు వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. దాంతో ఇద్దరు పరస్పరం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

బేస్తవారపేట, న్యూస్‌టుడే : డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని బేస్తవారపేట సహాయ సాంఘి సంక్షేమాధికారి రాజేశ్వరమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మునగాకుతో రోగ నిరోధక శక్తి పెంపు

కంభం, న్యూస్‌టుడే: మునగాకు తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ చెంచులక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలో 8వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు మునగాకు ప్రాధాన్యతను వివరించారు. ఆకుతో వంటలు వండి చూపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.


మునగాకుపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ చెంచులక్ష్మి

వ్యక్తి ఆచూకీకి ఫొటో విడుదల

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెం ప్రాంతాల్లో అనేక చోరీలకు పాల్పడిన ఒక వ్యక్తి ఫొటోను శుక్రవారం పోలీసులు ఫొటోను విడుదల చేశారు. ఈ వ్యక్తి కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సోషల్ మీడియాతో పాటు పత్రికా విలేకరులకు ఈ ఫొటోను సీఐ ప్రభాకర రావు, ఎస్సై చౌడయ్యలు విడుదల చేశారు. ఇతను ఊరికి దూరంగా ఉండే ప్రాంతాలను ఎంచుకొని తాళాలు వేసని ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతుంటాడని పేర్కొన్నారు. ఎవరికైనా తారసపడినా, కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 22న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సైమన్ విక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఫార్టే మేనేజ్‌మెంట్ సర్వీసెస్, మాస్టర్ మైండ్, డైకిన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. 19 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. జిల్లాలోని నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

కంభం (రాచర్ల), న్యూస్‌టుడే: పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా రాచర్ల మండలం రంగారెడ్డిపల్లి, సత్యవోలు, గంగంపల్లి, కాలువపల్లి గ్రామాల్లో సిమెంట్ రహదారుల నిర్మాణానికి శుక్రవారం ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి భూమి పూజ చేశారు. పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ● **కొమరోలు:** మండలంలోని అల్లినగరం, వట్టివేపమానిపల్లె, యర్రగుంట్ల, రెడ్డిచెర్ల గ్రామాల్లో నిర్మించనున్న సీసీ రహదారులకు శుక్రవారం ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలీ శంకుస్థాపన చేశారు.

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

సమస్య: పెదారికట్ల బస్టాండ్ సెంటర్ సిమెంట్ రహదారిపై వర్షపు నీరు నిలుస్తోంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించండి.
– కొండయ్య, స్థానికుడు

సమాధానం: నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. – శ్రీదేవి, ఈవోఆర్డీ



వైద్యశాల ప్రాంగణం.. బురదమయం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే:

అయిదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు యర్రగొండపాలెం 100 పడకల వైద్యశాల ప్రాంగణం జారుడు బండాల మారింది. ఈ వైద్యశాలను రూ.23 కోట్లతో నిర్మించారు. భవనం ముందు ఉండే ప్రాంగణం చిరుజల్లులు కురిసినా బురదమయంగా మారుతోంది. కొందరు దాతలు ఈ ప్రాంగణంలో మట్టి పోయించినా సమస్య తీరలేదు. ఈ వైద్యశాల పరిస్థితిని అధికారులు జిల్లా కలెక్టర్‌కు సైతం విన్నవించారు. స్థానిక తెదేపా భాజపానాయకులు దీనిని బాగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అపరిశుద్ధంగా ఉన్న ఈ వైద్యశాల ప్రాంగణంలోకి పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రాంగణమంతా దుర్వాసన వెదజల్లుతుంటుంది. ఉన్న జబ్బులకు తోడు రోగులకు కొత్త జబ్బులు సోకే ప్రమాదం ఏర్పడింది. ఈ పరిస్థితిని మార్కాపురం సబ్ కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. స్థానిక భాజపా నాయకులు ఏనుముల నాగేశ్వరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ప్రాంగణ మొత్తం తిరిగి అక్కడి వైద్యశాల ఇన్‌ఛార్జి డాక్టర్ యదిద్యాతో మాట్లాడారు. పరిస్థితి వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లేందుకు భాజపా నాయకులు ప్రయత్నిస్తున్నారు. పట్టణంలోని పలు బజార్లలోని రహదారులు చిత్తడి గా మారి పాదచారులు జారిపడే పరిస్థితి ఏర్పడింది. వర్షం వస్తే నడవడానికి కూడా కష్టంగా ఉందని తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరతున్నారు.


వైద్యశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న భాజపా నాయకులు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:

సమస్య: మండలకేంద్రం హెచ్‌ఎంపాడులో నీటి ట్యాంకు ఉన్నా నీళ్లు విడుదల చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి గ్రంథాలయం వద్ద ఉన్న ట్యాంకుకు నీరు రావడం లేదు. వెంటనే చర్యలు తీసుకోవాలి. - వి.కేశవరావు, గ్రామస్థుడు

సమాధానం: పంచాయతీ నిధులు వెచ్చించి మరమ్మతులు చేయిస్తాం. -శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని పన్నూరు బీసీ కాలనీలో కాలువలు లేకపోవడంతో పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోయింది. దోమలకు నిలయంగా మారి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. -కోటయ్య, స్థానికుడు

సమాధానం: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి గుంతల్లో మట్టితోలి చదును చేయించటంతో పాటు వీధుల్లో బ్లీచింగ్ చల్లిస్తాం. -సాంబశివరావు, ఈవోఆర్డీ

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

బాల్య వివాహాలకు అడ్డుకట్ట తప్పనిసరి

కనిగిరి: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలన అవగాహన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో బాలికలకు బాల్య వివాహాల నిషేధ చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, అత్యవసర ఫోన్ నంబరు 112పై అవగాహన కల్పించాలన్నారు.

బేకరీ ఉత్పత్తుల తయారీపై శిక్షణ

తాళ్లూరు, న్యూస్‌టుడే: సమగ్ర శిక్ష, బ్రైట్ సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తాళ్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఫుడ్ ప్రాసెసింగ్‌పై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. పదోతరగతి విద్యార్థినులకు బేకరీలో తినుబండారాల తయారీపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు జి.సుజాత, ట్రైనర్ వై.గీతాంజలి పాల్గొన్నారు.

ప్రతిభకు పదును



వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్న విజేతలతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్, ఉపాధ్యాయులు

దర్శి, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం దర్శి మండలం తూర్పువెంకటాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో 8, 9, 10 తరగతులకు చెందిన 51 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన గుండ్లకుంట కుడాన్ (పదో తరగతి), బి.ఎ.పవన్‌సాయి (పదో తరగతి), జంపాల గురుప్రసాద్ (9వ తరగతి) తదితరులకు ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్, ఉపాధ్యాయుల చేతులమీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెంచయ్య, నారాయణరావు, శ్రీశైలం, శైలజాదేవి, అనిత, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నష్టం లెక్కిస్తాం.. అన్నదాతలను ఆదుకుంటాం

• రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి
• 'న్యూస్‌టుడే'తో కనిగిరి ఏడీఏ వెంకటరమణ



పోలవరంలోని కందిచేనులో నిలిచిన నీరు

ముఖాముఖి



అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కనిగిరి వ్యవసాయ సహాయ సంచాలకుడు ఐ.వెంకటరమణ తెలిపారు. సబ్ డివిజన్‌లో సజ్జ పంట పూర్తిగా దెబ్బతిందని, ఈ-క్రాప్ చేయించుకున్న ప్రతి రైతుకు ప్రభుత్వ పరంగా పరిహారం అందేలా చూస్తామన్నారు. సబ్‌డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో వ్యవసాయాధికారుల బృందాలు పంట నష్టం అంచనా వేస్తున్నాయన్నారు. వర్షాల వల్ల పంటలకు వచ్చే తెగుళ్ల నివారణ చర్యలు, ఇతర వివరాలను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వెల్లడించారు. - న్యూస్‌టుడే, కనిగిరి

? : న్యూస్‌టుడే: సబ్ డివిజన్‌లో వర్షాలకు ఏ పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లింది?

✓: ఏడీఏ: కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లో వారం రోజులుగా వర్షాలు పడుతున్నాయి. దీంతో కంది, సజ్జ, మినుము పంటలు దెబ్బతిన్నాయి. కనిగిరి, వెలిగండ్ల, పామూరు, సీఎస్‌పురం మండలాల్లో పదిహేను వందల ఎకరాల్లో సజ్జ పంటకు నష్టం వాటిల్లింది. కళ్లాల్లో ఉన్న కంకులు సైతం తడిసి పోయి మొలకెత్తి, బూజు పట్టి ఎందుకూ పని కిరాకుండా పోయాయి. ఎక్కడైనా గింజలు బూజు పట్టకుండా ఉంటే ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయిస్తాం. కంది, మినుము చేలు కూడా కొన్ని చోట్ల నీట మునిగి కొంతమేర దెబ్బ తిన్నాయి.

? : రైతులు, కౌలు రైతులకు పరిహారం అందుతుందా?

✓ : కనిగిరి నియోజకవర్గంలో మొత్తం 58,596 మంది మంది రైతులు ఈకేవైసీ, ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి. ఇందులో 57,567 మంది నమోదు చేయించుకున్నారు. మరో 1029 మంది చేయించుకోలేదు. ఎందుకంటే వీరు గ్రామాల్లో లేరు. అందుబాటులో లేనందున ఈకేవైసీ చేయించుకోలేదు. ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించుకున్న వారందరికీ ప్రభుత్వం పరంగా పరిహారం, రాయితీలు తప్పక వస్తాయి. నియోజకవర్గంలో కౌలు రైతులకు 7,013 కౌలు కార్డులు ఇవ్వాల్సి ఉండగా 6,085 మంది అర్హులకు కౌలు కార్డులు ఇచ్చాం. వీరికి కూడా అన్ని విధాలుగా రాయితీలు అందుతాయి.

? : న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు?

✓ : కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 51,692 ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా, ఖరీఫ్‌లో 50,148 ఎకరాల్లో పంటలు వేశారు. అందులో కంది 43,985, సజ్జ 4,144, మినుము 108, వరి 1,294 ఎకరాల్లో సాగు చేశారు. రబీలో ఈ విస్తీర్ణం మరింత పెరగనుంది.

?: నకిలీ విత్తనాల వల్ల నష్టపోతే పరిహారం అందిస్తారా..?

✓: కనిగిరి నియోజకవర్గంలోని పామూరు, కనిగిరి, పీసీపల్లి, వెలిగండ్ల, హనుమంతునిపాడు, సీఎస్‌పురం మండలాల్లో 60 వరకు ఎరువుల దుకాణాలున్నాయి. గతంలో వరి, మిరప, శనగ విత్తనాల్లో నకిలీలు రావడంతో రైతులు ఆందోళన చేసిన మాట వాస్తవమే. ఎవరైనా నకిలీ విత్తనాలు తీసుకుని పంట నష్టపోతే అలాంటి రైతులకు కంపెనీల నుంచి పరిహారం అందేలా చూస్తాం. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులు రద్దు చేస్తామని దుకాణదారులను హెచ్చరించాం. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పని సరిగా రశీదులు తీసుకోవాలి.

? : రాయితీపై టార్పాలిన్ పట్టలు ఎప్పుడు ఇస్తారు?

✓: అయిదేళ్లలో ప్రభుత్వం రాయితీపై టార్పాలిన్ పట్టలు పంపిణీ చేయలేదు. దీంతో చాలా మంది రైతులు తాము పండించిన పంటను వర్షాల నుంచి కాపాడలేకపోయారు. ఇటీవల కురిసిన వర్షానికి పట్టలు లేనందున మొత్తం కళ్లాల్లోనే సజ్జ పంట తడిసిపోయింది. వీటిని దృష్టిలో పెట్టుకుని రాబోయే రోజుల్లో రైతులకు 50 శాతం రాయితీపై పట్టలు పంపిణీ చేస్తాం. పది వేలు పట్టలు కావాలని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం.

?: పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

✓: ఏడీఏ: ప్రస్తుత వర్షాలకు సజ్జ పంట బాగా దెబ్బ తింది. రంగు మారిన సజ్జలను ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ.2100కు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం. కంది చేనులో నీళ్లు చేరితే బయటకు పంపాలి. తెగుళ్లు సోకకుండా ముందస్తు జాగ్రత్తగా వేప నూనె పిచికారీ చేయాలి. కీటకాల నుంచి పంటను రక్షించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఇప్పటికే అవగాహన కల్పించాం. అందుబాటులో ఉండే వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలి.



చిన ఇర్లపాడు వద్ద వర్షానికి తడిసి మొలకలొచ్చిన సజ్జ కంకులు

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దని ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, మహిళలు

కనిగిరి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలోని కనకపట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద శుక్రవారం ఉద్యోగులు, మహిళలు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ.. నిత్యం మహిళలు, బాలికలు, ఉద్యోగులు, తిరిగే ప్రాంతం, అందులోనూ ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఎక్సైజ్, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా బలవంతంగా ఇక్కడే ఏర్పాటు చేయడం ఏమిటని మండిపడ్డారు. గతంలో కూడా ఇక్కడే ఏర్పాటు చేయడం వల్ల మహిళలు ఎంతో ఇబ్బందులు పడ్డారన్నారు. మందుబాబులు అర్ధరాత్రి వరకు రోడ్లపై తిరుగుతూ మహిళల వెంట పడుతున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో మద్యానికి నగదు లేకుంటే ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాల్లోని పెట్రోల్‌ను సైతం తీసేస్తున్నారని వాపోయారు. రద్దీగా ఉండే చోట ఏర్పాటు చేయడం సబబు కాదన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై టి.శ్రీరామ్ అక్కడకు చేరుకుని ఉద్యోగులు, మహిళలతో మాట్లాడారు. అభ్యంతరం ఉంటే వినతి పత్రం ఇవ్వాలని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి దుకాణాన్ని మరో చోటకు మార్చేలా చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

తెదేపా సమీక్ష సమావేశానికి గొట్టిపాటి

దర్శి, న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర పార్టీ సమీక్ష సమావేశంలో శుక్రవారం దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఇతర నాయకులతో కలిసి ఆమె హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో పాటు ఇతర నాయకులను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు.



బాలకృష్ణను కలిసిన గొట్టిపాటి లక్ష్మి

నాణ్యమైన విద్యుత్తు సరఫరానే లక్ష్యం

ముండ్లమూరు, న్యూస్‌టుడే: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్యమని దర్శి ఈఈ శ్రీనివాసులు తెలిపారు. ముండ్లమూరు విద్యుత్తు ఉప కేంద్రాన్ని శుక్రవారం ఏడీఈ కె.పిచ్చయ్యతో కలిసి సందర్శించారు. నూతనంగా నిర్మిస్తున్న ఏఈ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మోటార్లు వేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పెండింగ్ బకాయిలపై దృష్టి సారించి నూరుశాతం బిల్లులు వసూలు చేయాలని సూచించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు, ఏడీఈ పిచ్చయ్య



పాతసింగరాయకొండలో రహదారి నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరించిన తెదేపా నాయకులు

పల్లెపండగలో అభివృద్ధి పనులకు శ్రీకారం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ మండలంలోని పది గ్రామాల్లో శుక్రవారం రూ.3.7 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మండల తెదేపా అధ్యక్షుడు సింగయ్య ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించి అధికారుల సమక్షంలో శిలా ఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయమణి, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీహరి, సిబ్బంది, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

● తాళ్లూరు: తాళ్లూరులోని వెంకటరెడ్డిపాలెం నుంచి పారువేట బజారు వరకు సిమెంటు రహదారి నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఎంపీడీవో కె.సుందరరామయ్య, పలువురు సిబ్బంది పనులకు శంకుస్థాపన చేశారు. ఏపీవో మురళి, ఈసీ ప్రసాదు, కార్యదర్శి రమణారెడ్డి, సర్పంచి ఛార్లెస్‌సర్జన్, తెదేపా నాయకులు ఐ.శ్రీనివాసరెడ్డి, ఎం.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: ఇంటిలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. ఎస్సై వై.నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మక్కెనవారిపాలెంలో ఈ నెల 8న పట్టపగలు ఇంటిలో చోరీ జరిగింది. దీనిపై ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చోరీకి పాల్పడిన వ్యక్తి పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొండలరాయునిపాలేనికి చెందిన గొల్లప్రోలు రామాంజనేయులను వేంపాడు క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం అరెస్టు చేశారు. చోరీ చేసిన రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకొని దర్శి కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక డంప్ స్వాధీనం

జరుగుమల్లి: అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను జరుగుమల్లి తహసీల్దార్ జనార్దన్ స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్నకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాల మేరకు జరుగుమల్లి శివారున నిల్వ చేసి ఉన్న 20 ట్రక్కుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జేసీబీని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సీసాల తరలింపు

కురిచేడు: కురిచేడులోని రెండు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉన్న 1,652 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, మార్కాపురంలోని మద్యం నిల్వ కేంద్రానికి తరలిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన దుకాణాలను పరిశీలించి వీఆర్వో నాగరాజుతో కలిసి పంచనామా చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15 వరకు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని, అందులో ఉన్న మద్యం నిల్వలను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

టంగుటూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడికి గాయాలైన సంఘటన టంగుటూరు పరిధిలోని బాపూజీ కాలనీ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సింగరాయకొండకు చెందిన బాపట్ల శివకుమార్ ఆర్టీసీ బస్సులో ఒంగోలు వైపు వస్తూ బాపూజీ కాలనీ పెట్రోల్ బంకు వద్ద దిగారు. కొంత దూరం నడుచుకుంటూ వెళ్తుండగా.. తూర్పు నాయుడుపాలెం నుంచి అపసవ్య దిశలో పొన్నారసు రవికుమార్ ద్విచక్రవాహనంపై వస్తూ శివకుమార్‌ను ఢీకొనగా కాలికి తీవ్ర గాయమైంది. ఎస్సై నాగమల్లేశ్వరరావు 108లో క్షతగాత్రుడిని ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రూ.లక్ష వెచ్చించి.. గుంతలు పూడ్పించి



ముండ్లమూరు మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ బసవాపురం రోడ్డు అధ్వానంగా తయారైంది. పెద్ద గుంతలు ఏర్పడి వర్షం పడితే మూడు అడుగుల మేర నీరు నిలిచి పోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గత వైకాపా ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ సమస్యను గ్రామస్థులు తీసుకెళ్లినా.. ప్రయోజనం లేకుండాపోయింది. గ్రామానికి ఎవరైన బంధువులు, తెలిసిన వారు రావాలంటే జంకుతున్నారు. దీంతో తెదేపా నాయకులైన బసవాపురానికి చెందిన కట్టా చిన్నవెంకంబొట్లు, శ్రీనివాసనగర్‌కు చెందిన ఇంద్రసేనారెడ్డిలు సొంత నిధులు రూ.లక్ష వెచ్చించారు. అద్దంకి-దర్శి ప్రధాన రహదారి నుంచి బసవాపురం వరకు, అక్కడ నుంచి శ్రీనివాసనగర్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర ప్రొక్లయిన్‌తో గుంతలు పూడ్చి రోడ్డును చదును చేయించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు దాతలను అభినందించారు. –న్యూస్‌టుడే, ముండ్లమూరు

వడ్డీ లేని రుణాలపై అవగాహన

కొండపి గ్రామీణం: డ్వాక్రా మహిళల జీవనోపాధి పెంపొందించేందుకు వడ్డీలేని రుణాలపై శుక్రవారం కొండపి వెలుగు కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఏపీఎం గోపీనాథ్ మాట్లాడుతూ.. పీఎంఈజీపీ, ఎఫ్‌ఎంఈ తదితర పథకాల ద్వారా మహిళలకు అందించే రుణాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా వయోజన విద్యపై సర్వే చేయాలని వెలుగు సిబ్బందిని ఆదేశించారు. ఆర్థిక లావాదేవీలను ఎప్పటికప్పుడు పుస్తకాల్లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

అభ్యసన లోపాలు గుర్తించాలి



సీఎస్‌పురంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎంఈవోలు ప్రసాదరావు, కొండారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

సి.ఎస్.పురం: డిస్లెక్సియ అనేది అభ్యసన వైకల్యమే తప్ప, వ్యాధి కాదని ఎంఈవోలు జగన్నాథం ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అన్నారు. భవిత కేంద్రం ఆధ్వర్యంలో డిస్లెక్సియపై శుక్రవారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఎవరైనా తెలివిగా ఉన్నప్పటికీ చదవడం, రాయడంలో ఇబ్బంది ఉన్నప్పుడు ఉపయోగించే పదం అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు దీనిని గమనించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ ఖాదరున్నీసా బేగం, ఐఈఆర్‌టీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● పామూరు: డిస్లెక్సియపై పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో జి.కురుణకుమారి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామస్వామి, ఐఈఆర్‌టీలు రాజారాం, సుకవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● దర్శి: దర్శిలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో నిర్దిష్ట అభ్యసన వైకల్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు రఘురామయ్య, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

● జరుగుమల్లి: ప్రపంచ డిస్లెక్సియ వారోత్సవాల సందర్భంగా జరుగుమల్లిలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు బి.నాగేంద్రవదన్, డి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పీడీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● కొండపి గ్రామీణం: మండలంలోని వెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు డి.భారతి అధ్యక్షతన విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని నిరసన



ముండ్లమూరు విద్యుత్తు ఉపకేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

దర్శి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్తు ఇంధన సర్దుబాటు ఛార్జీల పెంపుదలకు సిద్ధమైందని, దీన్ని వ్యతిరేకిస్తూ దర్శిలోని ఈఈ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. పార్టీ కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ.. తెదేపా అధికారంలోకి వస్తే సర్దుబాటు, ట్రూఅప్, సర్‌ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అనంతరం ఈఈ కార్యాలయ జేఈవో మహబూబ్‌బాషాకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, పిచ్చయ్య, నారాయణ, అదినారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● కొండపి గ్రామీణం: కొండపి ఆర్టీసీ ప్రాంగణంలో నిరసన సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. పార్టీ మండల కార్యదర్శి కేజీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. ● ముండ్లమూరు: స్థానిక విద్యుత్తు ఉపకేంద్రం వద్ద సీపీఎం మండల కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ. . గత ప్రభుత్వం మాదిరిగానే సర్దుబాటు ఛార్జీల పేరిట ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. ఈఈ శ్రీనివాసులు, ఏడీఈ కె.పిచ్చయ్యలకు వినతిపత్రం అందజేశారు. ● పామూరు: సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్తు ఉప కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. కె.మాల్యాద్రి, నాయకులు పాల్గొన్నారు.

● హనుమంతునిపాడు: సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మారెడ్డిపల్లి విద్యుత్తు ఉపకేంద్రం వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. పార్టీ నాయకులు బడుగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● సి.ఎస్.పురం: సీపీఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని స్థానిక విద్యుత్తు ఉప కేంద్రం ఎదుట నిరసన చేపట్టారు.

పాతూరు.. సమస్యలతో బేజారు

● మౌలిక వసతుల లేమితో స్థానికుల ఇక్కట్లు

కాలనీ కష్టాలు



కనిగిరి పాతూరు ప్రాంతం

కనిగిరి పట్టణంగా రూపాంతరం చెందిందంటే అందుకు బీజం పడింది మాత్రం పాతూరే. ఏళ్ల చరిత్ర కలిగిన పాతూరు అభివృద్ధిలో మాత్రం ఇంకా వెనుకంజలోనే ఉంది. నిరుపేదలు, రైతులు, వ్యవసాయ కూలీలు, బేల్దారీ కార్మికులు నివాసం ఉండే ఈ ప్రాంతంలో సమస్యలు వెంటాడుతున్నాయి. ఎంతోమంది పాలకులు మారుతున్నా ఇక్కడ మౌలిక వసతులు మాత్రం సమకూరడం లేదు. మురుగు నీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉంది. వారానికి ఒకసారి కూడా కాలువల్లో పూడిక తీయడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇక తాగునీటి పరిస్థితి అయితే మరింత ఆందోళనకరం. వారంలో రెండు, మూడు సార్లే కుళాయిలకు నీరు వస్తుంది. మిగతా సమయాల్లో ట్యాంకర్ల కోసం ఎదురు చూడాల్సిందేనని స్థానికులు వాపోతున్నారు. పేరుకు బ్రిటిష్ కాలంనాటి పార్కు ఉన్నా.. ఆక్రమణల చెరలో చిక్కుకు పోయి పశువులు చావిడిలా మారింది. మంచినీటి ట్యాంకులు ఉన్నా కొన్ని పాచిపట్టి, మరి కొన్ని నీళ్లు సరఫరాలేక నిరుపయోగంగా ఉన్నాయి. బస్‌షెల్టర్ ఉన్నా కొందరు ఆక్రమించి కనిపించకుండా చేస్తున్నారు. ఏ వీధిలో చూసినా కుక్కల బెడద అధికంగా ఉంది. పిల్లలను కరుస్తున్నాయని పలుమార్లు మున్సిపల్ అధికారులకు తెలియజేసినా ప్రయోజనం లేదని పాతూరు వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల అయితే పైపులైన్లు మురుగు కాలువల్లో ఉండడంతో, మంచినీరు కలుషితం అవుతుందని స్థానికులు చెబుతున్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల సమీపంలో పిచ్చిమొక్కలు మొలిచి విష జంతువులకు నిలయంగా మారింది. కొందరు రాత్రి వేళ పాఠశాల ప్రాంతాన్ని బహిర్భూమిగా వినియోగిస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నారు. పాతూరులో దొంగల బెడద కూడా అధికంగా ఉందని స్థానికులు తెలిపారు. శ్మశాన వాటికను కొందరు ఆక్రమించారని చెబుతున్నారు. వీధిలైట్లు ఉన్నా వెలకగ ఇబ్బందులు పడుతున్నామన్నారు. పాతూరు వెళ్లే మార్గంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద రాత్రి పూట మందుబాబులు, గంజాయి తాగేవాళ్లు ఉండటంతో మహిళలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పాతూరులో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ కె.డానియేల్ జోసెఫ్‌ను వివరణ కోరగా.. మున్సిపాలిటీ ప్రత్యేక నిధుల ద్వారా పాతూరు ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.



ప్రాథమిక పాఠశాల వద్ద పెరిగిన చిల్ల చెట్లు

మున్సిపాలిటీ - కనిగిరి

ప్రాంతం - పాతూరు
కుటుంబాలు - 1500
జనాభా - 5 వేలు
సమస్యలు - కుక్కల బెడద, తాగునీటి సమస్య, కాలువలు లేకపోవడం, ఇరుకు రోడ్లు



అధ్వానంగా మంచినీటి ట్యాంకు

పంట పొలాల పరిశీలన

దర్శి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డా.జి.శివనారాయణ పులిపాడులో రైతులు సాగు చేసిన వరి క్షేత్రాలను శుక్రవారం పరిశీలించారు. వరిలో ఉల్లికోడు ఉండడం గమనించిన ఆయన శాస్త్రవేత్తల ద్వారా నివారణ చర్యలను రైతులకు వివరించారు. తొలుత దర్శి కేవీకేను సందర్శించి అక్కడ ఉన్న వివిధ ప్రదర్శన క్షేత్రాలను సమన్వయకర్త డా.రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దర్శి మండల పరిధిలోని ఎస్సీ రైతులకు టార్పాలిన్ పట్టలను అందజేశారు. ● హనుమంతునిపాడు: హాజీపురం, హెచ్‌ఎంపాడు తదితర గ్రామాల్లో నిమ్మతోటల్లో తెగుళ్ల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన శాఖ అధికారిణి ఎం.అంజలీబాయ్ సూచించారు. అనంతరం హెచ్‌ఎంపాడు రైతు సేవా కేంద్రంలో ఏవో రమణ ఆధ్వర్యంలో పంటనష్టంపై సమీక్ష నిర్వహించారు. పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై సిబ్బందికి పశువైద్యాధికారి రాజశేఖర్ వివరించారు. ● తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం, నాగంబొట్లపాలెం, రామభద్రాపురం తదితర గ్రామాల్లోని పంటలను ఏవో బి.ప్రసాదరావు పరిశీలించారు. సజ్జ పంట 328 ఎకరాల్లో గింజలు రంగు మారాయని, బాగా తడిసిన కంకులు మొలకలు వచ్చాయన్నారు. వరి వంద ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తెలిపారు. జొన్న పంట ఏడున్నర ఎకరాల్లో దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు.

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

భూగర్భ జలాల పెంపునకు చర్యలు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: భూగర్భజలాలను అధికంగా వినియోగించిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు; తిరిగి నీటిమట్టం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. భూగర్భ జలాల పెంపుపై స్థానిక ప్రకాశం భవన్‌లో శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూగర్భ జలాల పెంపులో భాగంగా మార్కాపురం మండలం నికరంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసినట్లు వివరించారు. నీటి మట్టం పెంపుతోపాటు, స్థానిక నీటి వనరుల ఆధారంగా సాగు చేయాల్సిన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 23న నికరంపల్లిలో గ్రామసభ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ జోషఫ్‌కుమార్, ఏపీఎంఐపీ పీడీ పీవీ. రమణ, జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపిచంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఎస్ఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సులోచన సేవలు అభినందనీయం



ఏవో సులోచనను సన్మానిస్తున్న ఎస్పీ దామోదర్, ఇతర అధికారులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సుదీర్ఘకాలం పాటు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏవోగా అత్యుత్తమ సేవలు అందించి సాధారణ బదిలీల్లో భాగంగా ఏపీఎస్పీ 9వ బెటాలియన్ బదిలీపై వెళ్తున్న డీపీవో ఏవో సులోచనకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ.. సుమారు ఆరు సంవత్సరాలపాటు జిల్లా పోలీసు కార్యాలయంలో విశిష్ట సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన ల్యాప్‌టాప్ అందజేత



అధునాతన ల్యాప్‌టాప్ ద్వారా బోధన చేస్తున్న ఐడీపీ ప్రాజెక్టు మేనేజర్

ఒంగోలు నగరం: నగరంలోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం రూ.8 లక్షలు విలువైన అధునాతన జెడ్ స్పేస్ ల్యాప్‌టాప్‌ను అందజేసింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఏఆర్ అండ్ వీఆర్ టెక్నాలజీతో సైన్స్ విద్యార్థులకు బోధన చేయడానికి వినియోగిస్తారు. ప్రారంభ కార్యక్రమంలో ఐడీపీ ప్రాజెక్టు డైరెక్టర్ సచిన్ మహేంద్ర పాల్గొని ల్యాప్‌టాప్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కల్యాణ్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సృజనాత్మకంగా విద్యార్థులకు వివరించడానికి ఇది దోహదపడుతుందన్నారు. అకడమిక్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్తు సర్దుబాటు ఛార్జీల రద్దుకు డిమాండ్

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలతో ప్రజలపై మోపుతున్న భారాలను రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బంకా సుబ్బారావు డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాదుడే బాదుడు అంటూ ఆర్భాటంగా ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత పాలకుల లాగే విద్యుత్తు భారాలను ప్రజలపై మోపి మోసం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎన్. వెంకటేశ్వర్లు, భగత్‌సింగ్, వెంకటసుబ్బారావు, బంకా సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ● మద్దిపాడు: పెంచిన విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ● ఒంగోలు గ్రామీణం: విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలను రద్దుపై సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా విద్యుత్ భవన్ వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు.



ఎస్ఎన్‌పాడు: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రేపు ఉచిత వైద్య శిబిరం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: మండలంలోని గంగవరంలో ఈ నెల 20న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సేవా సంకల్ప ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు. గంగవరంలోని హనుమంతరావు ప్రైవేటు ఉన్నత పాఠశాలలో ట్రస్టు ఆధ్వర్యంలో ఒంగోలు కిమ్స్ వైద్యశాల, గుంటూరు శంకర్ వైద్యశాల, ఎంఎన్ఆర్ వైద్యశాలల సహకారంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: ఒంగోలు డిపో పరిధిలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఆర్టీసీకి సంబంధించిన సమస్యలపై డయల్ యువర్ డీఎం చేపడుతున్నామన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విపత్తుల వేళా కావాలి ఉపాధి

▶ ఊసేలేని ప్రత్యామ్నాయ ఉపాధి ప్రణాళికలు
▶ అవస్థలు పడుతున్న మత్స్యకారులు



తుపాను కారణంగా కొత్తపట్నం సముద్రపు ఒడ్డుకు చేర్చిన పడవలు

ప్రకృతి విపత్తులు మత్స్యకారుల కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వానొచ్చినా.. తుపానులు సంభవించినా వారు జీవనోపాధికి దూరమవుతున్నారు. రెక్కడితే గానీ డొక్కాడని ఆ కుటుంబాలను గత ప్రభుత్వం గాలికొలేసింది. భృతి అందించక.. ఉపాధి కల్పించక.. వారి పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. ప్రస్తుత ప్రభుత్వమైనా విపత్తుల వేళ వారిని ఆదుకుని... ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – న్యూస్‌టుడే, కొత్తపట్నం

కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెంతోపాటు, మడనూరు, ఈతముక్కల, రాజుపాలెం, వజ్జిరెడ్డిపాలెం, రంగాయపాలెం, గుండమాల గ్రామాలకు చెందిన సుమారు 6 వేల మంది మత్స్యకారులు సముద్రపు వేటకు వెళ్తుంటారు. ఏటా మత్స్య సంపద వృద్ధిలో భాగంగా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15వ తేదీ వరకు రాష్ట్ర మత్స్యశాఖ సముద్రం వేటపై నిషేధం విధిస్తోంది. దీనిపై ఆధారపడిన మత్స్యకారులు ఆ రెండు నెలలు వేటకు వెళ్లరు. ఆ విరామ సమయంలో ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైతే రూ.10 వేల చొప్పున భృతి ఇవ్వాలి. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల చాలామంది అర్హులు భృతి దూరమయ్యారు. అలాగే ఏటా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలో సహజంగా తుపానులు సంభవిస్తుంటాయి. ఆ సమయంలో వారి వేటకు వెళ్లరు. ఆ కాలానికి బాధిత కుటుంబాలకు ఎలాంటి పరిహారం అందదు. తద్వారా ఆయా కుటుంబాలు ఎలాంటి ప్రత్యామ్నాయ ఉపాధి లేక ఆర్థికంగా చితికిపోతున్నాయి.

వారం రోజులుగా వేట బంద్..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో పాటు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు తుపాను హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు కురిశాయి. వాతావరణ మార్పుల దృష్ట్యా ఈ నెల 12వ తేదీ నుంచే మత్స్యకారులు వేటకు వెళ్లలేదు. వచ్చే వారంలో మరో అల్పపీడనం ఉన్నట్లు వాతావరణశాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో మత్స్యకార కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 17న ఉదయం తిరుపతి జిల్లా తడ వద్ద సముద్రతీరం దాటినప్పటికీ తుపాను ప్రభావంతో సముద్రతీరంలో అలలు ఉద్ధృతి మరింత కొనసాగుతోంది. మరో రెండు, మూడు రోజులపాటు వేటకు వెళ్లలేని పరిస్థితి. ఇన్ని వాతావరణ పరిస్థితుల్లో వారి వినతి మేరకు 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో వారి ప్రత్యామ్నాయంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 100 రోజులపాటు పనిదినాలు కల్పించేలా ప్రణాళిక చేశారు. ఆ దిశగా అవగాహన కూడా కల్పించారు. ఆ తర్వాత అమలుకు నోచుకోలేదు. వేటకు వెళ్లితే పూట గడవని కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం ఉండటం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అయినా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గం చూపించడంతోపాటు, కష్టకాలంలో పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

లాగ్‌బుక్‌లో వివరాల నమోదు తప్పనిసరి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పోతురాజు కాలువపై గుత్తిగొండవారిపాలెం వద్ద నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రం (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను శుక్రవారం కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పరిశీలించారు. 15 ఎంఎల్‌డీ స్థామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ ద్వారా శుద్ధి చేసిన నీటిని పొలాలకు వినియోగిస్తున్నట్లు అధికారులు వివరించారు. నిర్వహణ విధి విధానాలు గురించి కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుత్తిగొండవారిపాలెం వద్ద గల వేస్ట్ డపింగ్ యార్డు ప్రాంతాన్ని పరిశీలించి రోజుకు ఎన్ని వాహనాలు డంప్ చేస్తున్నారనేది లాగ్‌బుక్‌లో అన్ని వివరాలతో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.



మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి

కొత్తపట్నం, న్యూస్‌టుడే: కొత్తగా వచ్చిన అధికారులు, గ్రామ కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని మండలాన్ని అభివృద్ధి చేయాలని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ప్రగతి నివేదికల గురించి వివరించారు. ఉపాధిహామీ పథకం కింద కొత్తపట్నం మండలంలోని 7 గ్రామాలకే సిమెంటు రోడ్ల నిర్మాణం నిమిత్తం రూ.7.50 కోట్ల నిధులు మంజూరు చేయడాన్ని ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. అనంతరం ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంపీడీవో సుజాత, ఈవోఆర్డీ బాలచెన్నయ్య, కార్యాలయ ఏవో నరేంద్రను ఘనంగా సన్మానించారు.



ఈవోఆర్డీ బాలచెన్నయ్య, ఏవో నరేంద్రను సన్మానిస్తున్న మండల నాయకులు, అధికారులు

పెరిగిన రామతీర్థం నీటి మట్టం

చీమకుర్తి: ఇటీవల కురిసిన వర్షాలు, సాగరు ఒంగోలు బ్రాంచి కాలువ ద్వారా వచ్చి చేరుతున్న జలాలతో రామతీర్థం జలాశయం నీటి మట్టం పెరుగుతూ వస్తోంది. ఈనెల 10వ తేదీన రిజర్వాయర్ నీటి మట్టం 82.05 మీటర్లుగా ఉండగా శుక్రవారం సాయంత్రానికి 83.17 మీటర్లకు చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.514 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.224 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


వేధింపులపై కేసు నమోదు

చీమకుర్తి, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడంటూ ఎస్కే జరీనా అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం భర్త సుభానిపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు.

విశాంత్ర జడ్జి భార్యకు టోకరా

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఓ విశ్రాంత జడ్జి భార్యకు వ్యక్తి టోకరా ఇచ్చారు. తాను కష్టాల్లో ఉన్నానని చెప్పి ఆమెను నమ్మించి రూ.9.50లక్షల నగదును తీసుకొని ఇంత వరకు ఇవ్వలేదు. దీనిపై విశ్రాంత జడ్జి భార్య శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాల మేరకు.. సంతనూతలపాడుకు చెందిన చింతలపూడి కీర్తి భర్త ఉద్యోగ రీత్యా కృష్ణా జిల్లా మచిలీపట్నంలో స్థిరపడ్డారు. ఆమెకు ఒంగోలుకు చెందిన సయ్యద్ అహమ్మద్ పరిచయం. 2021లో తాను కడపలో ఇళ్లు అమ్మి రూ.72కోట్లు తీసుకొని ఒంగోలుకు రాగా అక్కడ పోలీసులు పట్టుకున్నారని, రూ.1.50కోట్లు ఇస్తేనే సదరు నగదు ఇస్తానని చెబుతున్నారని ఆమెను నమ్మించారు. ఈ క్రమంలో వివిధ సందర్భాల్లో రూ. 9.50 లక్షల నగదును వసూలు చేశారు. ఎప్పుడు డబ్బులడగిన రేపు, మాపు అంటూ తప్పించుకునే తిరిగేవాడు. దీంతో బాధితురాలు నాకు న్యాయం చేయాలంటూ సంతనూతలపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఇంకా కేసు నమోదు చేయలేదని ఎస్సై అజయ్‌బాబు పేర్కొన్నారు.

సుజాత నగర్‌లో నీటికి కటకట



నగరంలోని సుజాతనగర్‌లోని పలు వీధుల్లో నీటి ఎద్దడి నెలకొంది. ప్రధానంగా 2,3,5వ లైన్‌లో ఒకవైపు నీరు వస్తే మరో వైపు రావడం లేదు. ఓవర్ హెడ్ ట్యాంక్ దగ్గరలోనే ఉన్న చివరి వరకు అందని దుస్థితి. గతంలో ఉదయం 6 గంటల సమయంలో నీటిని వదిలేవారని, ఒక సంవత్సర కాలం నుంచి సమయం మార్చి అర్ధరాత్రులు నీటిని వదులుతుండటంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అర్ధరాత్రులు వేచి ఉండి జలం పట్టుకోకపోతే రోజంతా నీరు ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్యలు వల్ల అద్దెకు ఎవరు ఉండటానికి ఎవరు రావటంలేదని.. ఇక్కడి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు (సుజాత నగర్)

పిచ్చుకగుళ్లల్లా విద్యుత్తు స్తంభాలు



గాంధీరోడ్డులోని పప్పుబజార్, దక్షిణ బజార్, రామాలయం వీధిలో విద్యుత్తు స్తంభాలు పిచ్చుకగుళ్లను తలపిస్తున్నాయి. వివిధ దుకాణాలు, నివాసాల నుంచి వచ్చే తీగలను ఒకే స్తంభానికే ఏర్పాటు చేయడంతో ఈ దుస్థితి నెలకొంది. ఏదైనా విద్యుత్తు సమస్య తలెత్తినప్పుడు, వాటిని సరిచేసే సమయంలో ఏ తీగ ఎవరిదో తెలియటానికే చాలా సమయం పడుతుంది. అప్పటివరకు కరెంట్ సరఫరా అంతరాయం నిలిపేయాల్సి వస్తుంది. మరోవైపు విద్యుత్తు తీగలు కూడా ఇళ్లకు అనుకొని ప్రమాదకరంగా వెళ్తున్నాయి. గాంధీరోడ్డులోని త్యాగరాజ మందిరం బజార్‌లో, మరికొన్నీ వీధులలో కొత్త విద్యుత్తు స్థంభాలను ఏర్పాటు చేసి పాత వాటిని తొలగించకుండా అలానే వదిలేశారు. దీంతో రోడ్లు మరింత ఇరుకుగా మారిందని.. వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– ఒంగోలు అంజయ్య రోడ్డు(గాంధీ రోడ్డు), న్యూస్‌టుడే

పల్లెల ప్రగతికి ప్రభుత్వం ప్రాధాన్యం

కొత్తపట్నం, ఒంగోలు గ్రామీణం, నాగులుప్పలపాడు, మద్దిపాడు, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండంలోని వివిధ గ్రామాల్లో ఎంపీడీవో మహాలక్ష్మీ ఆధ్వర్యంలో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ● కొత్తపట్నం మండలం ఈతముక్కల, గవండ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం గ్రామాల్లో ఉపాధిహామీ నిధుల కింద రూ.4.50 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించనున్న సిమెంటు రోడ్ల పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, పీఆర్ ఏఈ రామ్‌కుమార్, ఈవోఆర్డీ వేణు, ఏపీవో రత్నజ్యోష్ణ తదితరులు పాల్గొన్నారు. ● ఒంగోలు మండలం చింతాయగారిపాలెం గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద నూతనంగా నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ● మద్దిపాడు మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీడీవో జ్యోతి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు.



కొత్తపట్నం: ఆవిష్కరించిన శిలాఫలకం వద్ద డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, అధికారులు

బాబురావు పార్కు పరిశీలన

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వినియోగానికి అనువుగా పార్కులను సిద్ధం చేయాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఆహ్లాదం.. వర్షార్పణం శీర్షికన శుక్రవారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సంతపేటలోని నాటు బాబూరావు పార్కును పరిశీలించారు. పార్కులో ఉన్న ఖాళీ నీళ్ల సీసాలను వెంటనే తీసివేయాలని వాచ్‌మెన్‌ని ఆదేశించారు. కాలువల పక్కన మట్టిని తొలగించనందుకు సచివాలయ శానిటరీ ఇన్స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్నేహ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని సుందరయ్య భవన్‌లో కొత్తగా నెలకొల్పిన స్నేహ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిని ఒంగోలు, మార్కాపురం ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, కందుల నారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ శరత్ మల్లాపెద్ది, అప్తమాలజిస్ట్ డాక్టర్ స్నేహ యడ్లపల్లి ఆసుపత్రిలో అందించనున్న వైద్య సేవలు గురించి వివరించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావు, నగరంలోని వైద్యులు పాల్గొన్నారు.



రిబ్బన్ కత్తిరిస్తున్న ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, నారాయణరెడ్డి

నట్టల నివారణలో జాగ్రత్తలు అవసరం

ఒంగోలు గ్రామీణం ఒంగోలు మండలం త్రోవగుంట గ్రామంలో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి బేబిరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నట్టల నివారణ బారిన పడితే రోగ నిరోధకశక్తి తగ్గి జీవాలు వ్యాధుల బారిన పడి మరణాలు సంభవించనున్నట్లు వివరించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా రెండు పర్యాయాలు నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ బసవశంకరరావు, వైద్య సిబ్బంది కె.లక్ష్మయ్య, ఆర్. ప్రగతి, పి.మాధవాచారి పాల్గొన్నారు. నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు పశు వైద్యశాలలో నట్టల నివారణ నిర్వహించిన కార్యక్రమంలో బేబిరాణి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

చీమకుర్తి: రైతులు పంటలు సాగు చేసే సమయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని డీఆర్సీ వ్యవసాయశాఖాధికారి వీవీ శేషమ్మ పేర్కొన్నారు. మండలంలోని కూనంనేనివారిపాలెంలో శుక్రవారం ఆర్కేవీవై, రాఫార్ పథకం కింద 2024-25కు రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులకు ఉద్యాన పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే:

సమస్య: అంబేడ్కర్ భవన్ మార్గంలో అన్నక్యాంటీన్ ఎదుట ఇటీవల తొలగించిన శిలాఫలకం వ్యర్థాలు అలాగే వదలివేశారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది – స్థానికులు
సమాధానం: రెండు రోజుల్లో మీ సమస్య పరిష్కరిస్తాం.
– కె.వెంకటేశ్వరరావు, కమిషనర్

సమస్య: కొప్పోలు ప్రధాన రోడ్డు వెంకటేశ్వర స్వామి గుడి ఎదుట రహదారిపై నీరు పారుతోంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది – స్థానికులు
సమాధానం: శనివారం సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. – కె.వెంకటేశ్వరరావు, కమిషనర్

జలం కలుషితం.. జనం కలవరం

❐ ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఫిల్టర్‌బెడ్

మండువవారిపాలెం(ఒంగోలు గ్రామీణం), న్యూస్‌టుడే:

ఒంగోలు మండలం మండువవారిపాలెం గ్రామస్థులు వాడుక నీటి అవసరాల కోసం చెరువుపైనే ఆధారపడతారు. ఈ మేరకు దాని ఒడ్డునే 1985లో ఫిల్టర్‌బెడ్ నిర్మించారు. తదనంతరం 2005లో మరమ్మతులకు గురైంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఏటా త్రోవగుంట మేజర్ కాలువ ద్వారా సాగర్‌నీటితో చెరువును నింపుతారు. పై నుంచి కాలువలో వచ్చే వ్యర్థాలతో నీరంతా కలుషితమవుతుంది. ప్రస్తుతం అదే నీటిని ట్యాంక్‌కు ఎక్కించి గ్రామానికి విడుదల చేస్తున్నారు. అవి తాగడానికి వీలుకాని పరిస్థితుల్లో శుద్ధ జలకేంద్రంపై ఆధారపడుతున్నారు. దాని మరమ్మతులకు ఎనిమిదేళ్ల కిందట రూ.10 లక్షల అంచనాతో ప్రతిపాదనలు తయారు చేశారు. ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు వస్తున్నారు..పోతున్నారు. అయినా ఇంతవరకు మరమ్మతుల ఊసేలేదు.

పట్టించుకోని అధికారులు..

సురక్షిత నీరు అందించాలనే ఉద్దేశంతో చెరువుపైన ఫిల్టర్‌బెడ్ ఏర్పాటు చేశారు. అనంతరం దాని నిర్వహణ అప్పట్లో గ్రామ పంచాయతీకి అప్పగించారు. మరమ్మతుల నిమిత్తం రూ.5 నుంచి 10 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉండటం, అంత మొత్తంలో పంచాయతీలకు నిధులు లేని కారణంగా వాటి నిర్వహణకు సంబంధించి ఆ పాలకవర్గాలు పట్టించుకోవడం లేదు. వైకాపా ప్రభుత్వం హయాంలో గత అయిదేళ్ల గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. మూడేళ్ల కిందట జలజీవన్ మిషన్ కింద పనులు చేయడానికి ప్రతిపాదించినా పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామాల్లో తాగునీటిని అందించే ట్యాంకులను 15 రోజులకోసారి శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలోనే క్లోరినేషన్ చేయాలి. ఆ ట్యాంకుల వద్ద శుభ్రం చేసిన తేదీ, మళ్లీ ఎప్పుడు శుభ్రం చేస్తారన్న తేదీలను కూడా రాయాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధనలు అమలు కావడం లేదు. ఎప్పుడు శుభ్రం చేస్తున్నారో కూడా సరిగ్గా తెలియని పరిస్థితి నెలకొంది.



పాడైన ఫిల్టర్‌బెడ్